సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఆటలకు వేళాయే..

పిల్లలకు ఆటల సమయం ఆసన్నమైంది. సెలవులు కావడంతో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. 8లో



గంధకంతో అధిక దిగుబడులు

ఉద్యాన పంటల్లో ముఖ్యమైన పోషక పదార్థాల్లో గంధకం ఒకటి. గంధకం వాడకం వల్ల 25 శాతం దిగుబడి పెరుగుతుందని ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. 8లో



టైర్ పంక్చర్.. వ్యాన్ బోల్తా

టైర్ పంక్చరై అరటి గెలల లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుల నియామకం



ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఏలూరు పార్లమెంట్



ముదునూరి మురళీకృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్



జెట్టి గురునాథరావు, మచిలీపట్నం పార్లమెంట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులను మంగళవారం నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు వెలువరించింది. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లకు అనుసంధానంగా పరిశీలకులు పనిచేసేలా నియమించారు. ఏలూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడిగా కాకినాడ జిల్లా పత్తిపాడుకు చెందిన పార్టీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజును నియమించారు. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులుగా నియమించారు.

ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి



ఖాళీ స్థలాలు పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించేలా అవసరమైన అభివృద్ధి పనులే చేపట్టేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలో కలెక్టర్ మంగళవారం పర్యటించారు. ఏపీ ప్రాంతాల్లో ఎంతెంత విస్తీర్ణం ఖాళీ స్థలాలు ఉన్నాయో జిల్లా కలెక్టర్‌కు సర్వేయర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం పట్టణ వాసుల ఆహ్లాదానికి, ఆరోగ్యానికి దోహదపడే పలు ప్రాజెక్టులను దాతల సహకారంతో చేపట్టామని, పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే పార్కులు, వాకింగ్ ట్రాక్స్, జిమ్ ఏరియా, గ్రీనరీ అభివృద్ధి, ఫౌంటెన్‌లు, పాత బస్టాండ్ పునర్నిర్మాణం, బస్టాప్ అందుబాటులో వస్తాయని, తద్వారా పట్టణ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం, సౌకర్యవంతమైన జీవన శైలి సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో కాళ్ల తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీవో డాక్టర్ బి.స్వాతి, ఈఓపీఆర్డీ ఎంవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వైద్యశాలల పరిశీలన



మానసిక వైద్యశాలను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్


భీమవరం : భీమవరం పట్టణంలోని శాంతి నర్సింగ్ హోం, ప్రశాంతి నర్సింగ్ హోమ్, వర్మ హాస్పిటల్‌ను మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను మానసిక రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న సౌకర్యాలు, వారి మానసిక స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాంతి మానసిక వైద్యశాల డాక్టర్ జీవీ రమణరావు, ప్రశాంతి వైద్యశాల డాక్టర్ మాదిరెడ్డి వెంకటరమణ, వర్మ హాస్పిటల్స్ మానసిక వైద్యురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వేసవి దృష్ట్యా జిల్లాలో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వడగాల్పులు, వర్క్ ఫ్రం హోం, ఈకేవైసీ తదితర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగాల్పుల బారిన పడకుండా ఉపాధి హామీ కార్మికులు ఉదయమే పనులు చేయాలన్నారు. రద్దీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు.

వితంతు పింఛన్లకు మెలిక

- భర్త పింఛన్ పొందుతూ మరణిస్తేనే భార్యకు వితంతు పింఛన్
- లేదంటే ఆ వితంతువుకు మొండిచెయ్యే
- జిల్లాలో వితంతు, ఓఏపీ పింఛన్ల కోసం 25 వేలకు పైగా దరఖాస్తులు
- 3,242 మందికి మాత్రమే స్పౌజ్ కోటాలో సాయం పంపిణీకి నిర్ణయం



సాక్షి, భీమవరం : ఇంటికి జీవనాధారమైన భర్త మరణిస్తే భార్యకు బతుకు భారం కాకుండా వితంతు పింఛన్‌తో ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. భర్త పింఛన్ పొందుతూ మరణిస్తేనే భార్యకు వితంతు పింఛన్ వర్తిస్తుందంటూ కొత్త భాష్యం చెబుతోంది. ఈ మేరకు జిల్లాలో పింఛన్ పొందుతూ 3242 మంది చనిపోగా వారి భార్యలకు మాత్రమే పింఛన్ల జారీకి ఆదేశాలిచ్చింది. మిగిలిన వేలాది మంది నిరుపేద వితంతువులకు మొండిచేయి చూపింది.

పెనుగొండలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్.సరస్వతి భర్త అనారోగ్యంతో కాలం చేసి ఏడాది కావస్తోంది. వితంతు పింఛన్ కోసం అప్పట్లోనే దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రాలేదు. రెండు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన వృద్ధుడు మృతి చెందగా ఆయన భార్యకు పింఛన్ మంజూరైంది. సచివాలయ ఉద్యోగులను అడిగితే ఆమె భర్త పింఛన్ పొందుతూ చనిపోవడంతో స్పౌజ్ కోటాలో ఆమెకు పింఛన్ ఇచ్చారని, తన భర్తకు పింఛన్ లేకపోవడంతో తనకు రాలేదని చెప్పారని తెలిపింది. పింఛన్ సాయం అందక బతుకు భారమవుతోందని ఆమె వాపోయింది.

25 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్

ఏప్రిల్ నాటికి జిల్లాలో వివిధ సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు 2,25,718 మంది ఉన్నారు. వీరిలో వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులు సుమారు 1,26,061 మంది ఉండగా, వితంతువులు 49,564, దివ్యాంగులు 28,025, మత్స్యకారులు, డప్పు కళాకారులు, అభయహస్తం తదితర లబ్ధిదారులు 22,068 మంది ఉన్నారు. 2024 జనవరిలో చివరిగా జిల్లాలోని 4,274 మందికి కొత్త పింఛన్లు ఇచ్చారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త మంజూరును నిలిపేసింది. వితంతు, వృద్ధాప్య, తదితర పింఛన్ల కోసం జిల్లా వ్యాప్తంగా 25 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అంచనా. గత ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు అందజేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 11 నెలల కాలంలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేదు. నవంబరు నుంచి మాత్రం పింఛన్ లబ్ధిదారుడు మృతిచెందితే స్పౌజ్ కోటాలో అతని భార్యకు పింఛన్ ఇస్తోంది. అంతకు ముందు చనిపోయిన వారి భార్యలకు స్పౌజ్ కోటాను వర్తింపచేయలేదు.

స్పౌజ్ కోటాలో పింఛన్ సాయం

2023 నవంబరు తర్వాత చనిపోయిన పింఛన్ లబ్ధిదారులు భార్యలకు మాత్రమే స్పౌజ్ కోటాలో పింఛన్ సాయం పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ లబ్ధి పొందేందుకు జిల్లాలో 3,242 మంది ఉన్నట్లు గుర్తించింది. భీమవరంలో 386 మంది ఉండగా, నరసాపురంలో 391, ఉండిలో 490, పాలకొల్లులో 383, ఆచంటలో 521, తణుకులో 498, తాడేపల్లిగూడెంలో 441 మంది ఉండగా గణపవరం మండలంలో 132 మంది ఉన్నారు. వీరిలో 1,929 మంది దరఖాస్తులు రాగా మిగిలిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మిగిలిన 1,313 మందిలో పది శాతం వరకు మృతులు ఉంటారని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా వితంతు పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులు 8 వేలకు పైగా ఉంటాయని అంచనా. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద వితంతువులకు ప్రభుత్వ నిర్ణయం ఆశనిపాతంలా తయారైంది. తమ భర్తకు పింఛన్ లేదన్న కారణంతో అర్హత ఉన్నా తమకు పింఛన్ మంజూరు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరి అర్హులైన వారందరికి పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇవ్వాలి



ఏడాదికాలంలో కొత్త పింఛన్ల మంజూరు లేదు. వితంతువులకు పింఛన్ ద్వారా భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం కొందరికి మాత్రమే సాయం అందించడం సరికాదు. స్పౌజ్ కోటాతో పాటు అర్హులైన వితంతువులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి.

– మెహర్ అన్సారీ, గృహిణి, తణుకు

ఉన్నవాటిని తొలగిస్తున్నారు



కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగిస్తున్నారు. వితంతువులకు పింఛన్లు వెంటనే మంజూరు చేసే వెసులుబాటు సరళంగా ఉండాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చే వరకు పెన్షన్లు మంజూరు చేయకపోవడం సరికాదు.

– పి.పూర్ణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి

దర్జాగా విద్యా వ్యాపారం


- ప్రైవేటు విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు
- ముందుగానే యూనిఫాం, పుస్తకాలకు సొమ్ములు వసూలు

భీమవరం: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లా వ్యాప్తంగా విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. కనీస నిబంధనలు పాటించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అధికారుల అండదండలతో వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సుమారు 495 ప్రైవేటు విద్యాసంస్థలుండగా వాటిలో 96 ప్రైమరీ, 190 అప్పర్ ప్రైమరీ, 209 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇంటర్, డిగ్రీ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం గాకుండా స్కూళ్లలో జాయిన్ చేసుకోకూడదనే నిబంధనలున్నా వాటిని పట్టించుకోకుండా విచ్చలవిడిగా ఒక్కో స్కూల్ వద్ద రెండు, మూడు కౌంటర్లు పెట్టి ప్రవేశ పరీక్షలు నిర్వహించి ముందుగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం వంటివి నిషేధమైనా స్కూళ్లు, కళాశాలల్లో ప్రవేశ ఫీజుతోపాటు, డిపాజిట్, ట్రావెలింగ్, స్కూల్, కళాశాల ఫీజు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీకి అదనం.. హాస్టల్ వసతి అవసరమైతే మరింత ఫీజులు చెల్లించాలి. జూనియర్ ఇంటర్ విద్యార్థుల నుంచి ఏడాదికి ఫీజు, ట్రావెలింగ్ రూపంలో దాదాపు రూ.1.40 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాసంస్థల్లో కనీసం ఆట స్థలాలు లేకపోగా మరికొన్ని స్కూళ్లు, కళాశాలలు ప్రధాన రహదారి పక్కనే నిర్వహిస్తున్నారు. రహదారిపై వెళ్లే ఇతర వాహనాల రణగణ ధ్వనులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలను అతిక్రమించి పుస్తకాలు అమ్మడం, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం వంటి ఘటనలపై విద్యార్థి సంఘాల నాయకులు పోరాటాలు చేసినా అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుక్స్, స్టేషనరీ నిల్వ ఉంచిన రూంలను తాత్కాలికంగా సీజ్ చేయడం మినహా ఆయా విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించడం లేదు. ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా? అనేది ప్రశ్నార్థకమే.. విద్యార్థులతో బట్టీపట్టించడమే గాక సెక్షన్ల వారీగా విభజించి తీవ్ర ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. సెలవు రోజులు, పాఠశాలల సమయం ముగిసిన తరువాత కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనకబడిన, సకాలంలో ఫీజులు చెల్లించని విద్యార్థులను స్కూల్ బయట నిలబెట్టడం, సహచర విద్యార్థుల ముందు హేళనగా మాట్లాడడం చేస్తున్నారు.



ప్రైవేటు స్కూల్ వద్ద ఫీజు చెల్లించడానికి గుమికూడిన విద్యార్థుల తల్లిదండ్రులు



JR INTER - DAYSCHOLAR

Adm. Fee	: 2000
Deposit (Refundable)	: 5000
MAINS Fee	: 80000
IIT/NEET Fee	: 105000
Bus 13-10 15	: Based on Point
Books + Stationary	: Extra
Uniform	: Separat

ఇంటర్ విద్యార్థి చెల్లించాల్సిన మొత్తం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



ప్రైవేటు విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యా సంవత్సరం ప్రారంభంగాకుండా ప్రవేశాలు చేస్తే నోటీసు ఇచ్చేలా మండల విద్యాశాఖాధికారులను ఆదేశిస్తాం. పుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తే చర్యలు తప్పవు.

– ఈ.నారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. వచ్చే నెల 24న సాయంత్రం 5 గంటలలోపు ఐటీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని తప్పనిసరిగా రసీదు పొందాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08816–297093, 9676099988 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోళ్ల వ్యర్థాలతో ఆక్వా సాగుపై ఆగ్రహం

సాక్షి స్పందన

కైకలూరు: కోళ్ల వ్యర్థాలతో ఫంగసిస్ చేపల సాగు చేస్తున్న చటాకాయి గ్రామానికి చెందిన రైతు ఘంటసాల సుబ్బరాజుకు మత్స్యశాఖ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 'చేపల సాగులో కోడి వ్యర్థాలు' అనే శీర్షికతో సాక్షిలో మంగళవారం వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. కైకలూరు మత్స్యశాఖ అధికారి చెలపురి గణపతి వెంటనే స్పందించారు. వ్యర్థాలతో సాగు చేస్తున్న 6.5 ఎకరాల చెరువును సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ కోళ్ళ వ్యర్థాలతో సాగు చేయడం నేరమన్నారు. సదరు రైతుకు కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా సాగు అనుమతి పత్రాన్ని రద్దు చేస్తున్నామన్నారు. సాగును వెంటనే నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.



కైకలూరు మండలం చటాకాయిలో పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో గణపతి, సిబ్బంది

జూలై నుంచి ఆక్వా పంట విరామం

పెనుమంట్ర: ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయకపోతే జూలై నుంచి ఆక్వా సాగు విరామం ప్రకటిస్తామని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. మంగళవారం రాత్రి పెనుమంట్రలోని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూపతి రాజు శ్రీనివాస్ రాజు నివాసంలో ఆక్వా రైతుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న భగవాన్ రాజు మాట్లాడుతూ కూలీ ధరలతో పాటు ఫీడ్ ధరలు గణనీయంగా పెరగడం, రొయ్యల ధరలను సిండికేట్లు భారీగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సిండికేట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయకపోతే క్రాప్ హాలిడే ఒకటే సరైన పరిష్కారం అన్నారు. జూలై నుంచి ఆక్వా సాగును నిలిపివేయాలని ప్రకటించారు.



మాట్లాడుతున్న గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు

ముందే వికసించిన మే పుష్పం



మే నెలలో పుష్పించే మే పుష్పం ముందుగానే వికసించి కనువిందు చేస్తోంది. సాధారణంగా ఏటా మే నెలలో మాత్రమే మే పుష్పాలు వికసించి ఆ తర్వాత కన్పించవు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శివరావుపేటలో నిమ్మలూరి శ్రీనివాస్ ఇంట్లో మొక్కకు మే పుష్పాలు ముందే వికసించి ఆకట్టుకుంటున్నాయి.

– భీమవరం

క్లుప్తంగా

పక్షుల కేంద్రం చెరువులో నీటిని నింపాలి



నీరులేక అడుగంటిన ఆటపాక పక్షుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న భాస్కరరావు

కైకలూరు: తాగునీటి అవసరాలకు విడుదల చేసిన పంట కాల్వల నీటిని ఆటపాక పక్షుల కేంద్రం చెరువుకు మళ్లించాలని పర్యావరణ ప్రేమికుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు డిమాండ్ చేశారు. నీరు లేక అడుగంటిన ఆటపాక పక్షుల కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి కొరత కారణంగా పక్షులకు ఆహారపు కొరత ఏర్పడుతోందన్నారు. నెల రోజులుగా కేంద్రంలో బోటు షికారు నిలిచిపోడడంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నా పర్యాటకులు నిరాశగా వెనుతిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువులో నీటిని నింపే ప్రయత్నం చేయాలని కోరారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నూజివీడు: బాకీ తీర్మానం నిమిత్తం ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి టి.నరసాపురం మండలం వెలగపూడికి చెందిన చింతపల్లి చక్రిసాయి రాంబాబుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018 నవంబరు 18న కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మడిచర్లకు చెందిన తలకొండ గోపాలకృష్ణ, చక్రిసాయి రాంబాబుకు రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత ఆ బాకీ తీర్చమని గోపాలకృష్ణ కోరగా, సాయి రాంబాబు రూ.1.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకులో వేయగా సాయి రాంబాబు ఎకౌంట్‌లో నగుదు లేదని వెనక్కు తిరిగి వచ్చింది. దీంతో గోపాలకృష్ణ కోర్టులో కేసు వేయగా విచారించిన మీదట జరిమానా, జైలుశిక్ష విధిస్తూ స్పెషల్ మేజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

నూజివీడు: కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. 15వ వార్డులోని కృష్ణవిలాస్ కాలనీలో నివాసముంటున్న కౌన్సిలర్ హరికోటి రమాదేవిని చూసేందుకు ఆమె తల్లి విస్సన్నపేట మండలం తాతకుంట్ల మిట్టగూడెంకు చెందిన మేడా కుమారి (55) వచ్చింది. రమాదేవి ఇంటి ఆవరణలో ఉన్న కుమారిపై మంగళవారం సాయంత్రం కోతులు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుండెనొప్పితో ఉపాధి కూలీ మృతి

కుక్కునూరు: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన కుక్కునూరు పంచాయతీ పరిధిలో జరిగింది. గ్రామంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన పెంకె వెంకయ్య (55) రోజులానే మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పనిముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కూలీలు ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందాడు.

ఆటలకు వేళాయే..

- క్రీడా శిక్షణ శిబిరాల్లో ఆటలపై తర్ఫీదు
- ఆసక్తి చూపుతున్న బాలబాలికలు



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో పుట్‌బాల్ సాధన



ఏలూరులో బాస్కెట్‌బాల్ సాధన చేస్తున్న చిన్నారులు

ఏలూరు రూరల్ : ఆటల సమయం ఆసన్నమైంది. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో బాలబాలికలు ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు ఆటలతో సేద తీరేందుకు సిద్ధమౌతున్నారు. చదువు, మార్కులు, ఫలితాల ఒత్తిడి నుంచి పిల్లలను విముక్తులను చేసేందుకు తల్లిదండ్రులు సైతం ఇదే సరైన సమయమని భావిస్తున్నారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకూ సుమారు 48 రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలను మానసిక, శారీరకంగా బలవంతులను చేసేందుకు ఆటలు ఎంతో ఉపయోగపడతాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. వేసవి శిక్షణతో భవిష్యత్తులో పిల్లలు ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దబడతారని చెబుతున్నారు. క్రీడాభిమానుల మన్ననలు అందుకుంటున్న క్రికెటర్ సచిన్ టెండుల్కర్, బ్యాడ్మింటన్ ప్లేయర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ తదితరులు వేసవి శిక్షణ శిబిరాల్లో సాధన చేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన వారేనని గుర్తు చేస్తున్నారు.

శిక్షణ శిబిరాలు

ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం శిక్షణ శిబిరాలకు ప్రధాన కేంద్రంగా మారనున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కోచ్‌ల ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, తైక్వాండ్, స్కేటింగ్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. ఏలూరు భిశ్వనాధ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ గణేష్ పిల్లలకు శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంది. మరోపక్క ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏలూరు, కొవ్వూరు, భీమవరంలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనుంది. ఇదే కోవలో బాస్కెట్‌బాల్, చెస్, కరాటే, కుంగ్‌ఫూ, వాలీబాల్, హేండ్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్ అసోసియేషన్లు సైతం ఏలూరు, కొవ్వూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం తదితర నగరాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధపడుతున్నాయి. దీనికి తోడు ఏలూరులోని పలువురు నిర్వాహకులు ఇండోర్‌లో బ్యాడ్మింటన్ శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొంది ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ



వేసవిలో పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మే 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం పలువురు పీఈటీ, పీడీ, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాము. నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాల్లో పిల్లలు ఆటలు నేర్చుకునేందుకు బాల్స్, హాకీ స్టిక్స్, నెట్స్ తదితర క్రీడాపరికరాలు అందిస్తాం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తాం. శిక్షణ తర్వాత పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు.

– బి శ్రీనివాసరావు, డీఎస్‌డీఓ

పిల్లల్లో ఆసక్తిని గుర్తించాలి



తల్లిదండ్రులు ముందుగా పిల్లల్లో ఉన్న ఆసక్తిని గుర్తించాలి. వారికి ఏ ఆటపై మక్కువ ఉందో తెలుసుకోవాలి. అనుభవజ్ఞుడైన కోచ్‌ను ఎంపిక చేసుకోవాలి. పిల్లాడు మానసిక, శారీరక స్థితి గూర్చి కోచ్‌కు వివరించాలి. దానికి అనుగుణంగా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి. సాధనకు అనుకూలమైన పలచటి, మెత్తటి స్పోర్ట్స్ డ్రెస్ పిల్లలచే ధరింపచేయాలి. మంచి పౌష్టికాహారం అందించాలి.

– డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్, సాయి సెంటర్ ఇన్‌చార్జి

బాస్కెట్‌బాల్ అంటే ఇష్టం



నాకు బాస్కెట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం. ఉదయం, సాయంత్రం సీనియర్లు నాకు బాస్కెట్‌బాల్ నేర్పుతున్నారు. నాతో పాటు చాలా మంది స్నేహితులు ఇక్కడకు వస్తున్నారు. మేమంతా సెలువులు అన్ని రోజులు ఇక్కడే బాస్కెట్‌బాల్ నేర్చుకుంటాం. పోటీల్లో పాల్గొంటాం.

– ఎం గిరీంద్ర

బాగా ఆడుకోవచ్చు



సమ్మర్ హాలిడేస్ వచ్చాయి. మళ్లీ స్కూల్ తెరిచే వరకూ బాగా ఆడుకోవచ్చు. స్టేడియంకు వెళ్లి ఆడుకుంటానని అమ్మకు చెప్పాను. నాన్న కూడా వెళ్లి ఆడుకో అన్నారు. అందుకే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వచ్చి ఆడుకుంటున్నాను.

– కె చిరుదీప్

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కొండమురుగు తేజశ్విని మృతదేహం

తాడేపల్లిగూడెం అర్బన్: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకొంది. రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత చింతలపూడికి చెందిన కొండమురుగు తేజశ్వి (23) తాడేపల్లిగూడెంలోని మదర్ వన్నినీ నర్సింగ్ స్కూల్‌లో బీఎస్సీ నర్సింగ్ విద్యను అభ్యసిస్తోంది. తాడేపల్లిగూడెంలోని గొల్లగూడెం ప్రాంతంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో నివాసం ఉంటుంది. మంగళవారం ఉదయం 11 గంటల వరకు హాస్టల్‌లోని తోటి విద్యార్థులతో కలసి మాట్లాడింది. తరువాత 12.30 గంటల సమయంలో తేజస్వీని కనబడకపోవడంతో హాస్టల్ వార్డెన్ సుజాత ఆరా తీయగా హాస్టల్‌లోని ఎవరూ లేని ఒక గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని కనపించింది. వార్డెన్ సుజాత పెద్దగా కేకలు వేయడంతో తోటి విద్యార్థులు అక్కడకు చేరుకొని తేజశ్విని కిందకు దింపే ప్రయత్నం చేశారు. తేజశ్విని 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తేజశ్వి మృతికి ప్రేమ వ్యవహారం కారణమై ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమెకు తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా తల్లి, అన్నయ్య, తమ్ముడు ఉన్నారు. రూరల్ ఎస్సై జీవీఎన్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైర్ పంక్చర్.. అరటి గెలల వ్యాన్ బోల్తా

- ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- అందరూ కాకినాడ జిల్లా వాసులే
- ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి వద్ద ఘటన



ఘటనా స్థలంలో రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న అరటి గెలలు





తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు, క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: టైర్ పంక్చరై అరటి గెలల లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన ఘటన ద్వారకాతిరుమల మండలంలోని గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై, పోలవరం కుడి కాలువ వంతెన వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం. కాకినాడ జిల్లా ఏలేశ్వరంనకు చెందిన పులుమంచుల ఆనందం (ఆనందరావు) అరటి గెలల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని తోటల్లో అరటి గెలలను కొనుగోలు చేశాడు. వాటిని నరికేందుకు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం, లింగంపర్తికి చెందిన బొలేరో డ్రైవర్ కాకర లోవరాజు, భద్రవరంనకు చెందిన పులుమంచుల ఈశ్వరరావు, లింగంపర్తికి చెందిన కోనా సత్యన్నారాయణ, అనుబోలు రామకృష్ణ (55), గుంప సూర్యనారాయణ(శివ) వ్యాపారి ఆనందంతో కలసి బొలేరో వ్యాన్‌లో వెళ్లారు. గెలలు నరికి, వ్యాన్‌లో లోడు చేసుకుని, ఏలేశ్వరం మండలం ఎర్రవరంలోని మార్కెట్‌కు వెళుతున్నారు. ద్వారకాతిరుమల మండలంలోని గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై, పోలవరం కుడి కాలువ వంతెన వద్దకు వచ్చేసరికి వ్యాన్ వెనుక టైరు పంక్చర్ కావడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో సహా వ్యాన్‌లో ఉన్న ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను భీమడోలు, నల్లజర్ల 108 అంబులెన్స్‌లలో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనుబోలు రామకృష్ణ మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు చికిత్స పొందుతున్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య



గోదావరిలో లభించిన ఉప్పల సాయిరాం మృతదేహం

కుక్కునూరు: గోదావరిలోకి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలోని వింజరం రేవులో జరిగింది. కుక్కునూరు ఎస్సై రామక్రిష్ణ చెప్పిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం, అశ్వారావుపేట మండలం, వినాయకపురం గ్రామానికి చెందిన ఉప్పల సాయిరాం (27) ఆటోమొబైల్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని చెప్పినా ఇంట్లో వాళ్లు వినకుండా పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో మంగళవారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. మధ్యాహ్నం ఇంటి నుంచి పోలిపాకలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు వింజరం రేవుకు చేరుకున్న సాయిరాం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను ఇంట్లో గొడవపడి వచ్చిన విషయం తెలుసుకున్న బంధువులు గోదావరి నది ఒడ్డున సాయిరాం బైక్ ఉండడాన్ని చూసి గోదావరిలో వెతకగా మృతదేహం లభించినట్టు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్సై రామక్రిష్ణ చెప్పారు.

చిన్నారి చికిత్సకు రూ.1,05,600 సాయం

సాక్షి స్పందన



జ్యోత్స్న చికిత్స నిమిత్తం సాయం అందజేస్తున్న సత్తిబాబు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు

కొయ్యలగూడెం: చిన్నారి చికిత్స నిమిత్తం దాతలు స్పందించి సాయం అందజేశారు. కొయ్యలగూడెంకు చెందిన కంచర్ల జ్యోత్స్న (7) అరుదైన వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు కాకినాడలో చికిత్స చేయిస్తుండగా ప్లాస్మా థెరపీ అవసరమని, రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతోందని వైద్యులు తెలపడంతో చిన్నారి కుటుంబ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. దీనిపై ఈనెల 29న 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన కొల్లూరు సత్తిబాబు ఫ్రెండ్స్ సర్కిల్ రూ. రూ.1,05,600 జోత్స్న బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ చిన్నారి మెరుగైన వైద్యానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు ఇప్పించాలని కోరారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలి

- కాలువల ఆధునికీకరణకు 16వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలి
- నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం తీర్మానం



ఎన్నెస్పీ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోట వీరబాబు

నూజివీడు: నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని మూడో జోన్‌లోని 2.36 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేయాలని ఎన్నెస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. నూజివీడులోని ఎన్నెస్పీ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్ట్ కమిటీ సమావేశాన్ని చైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పులిచింతల ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.ఆర్. మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ గత తీర్మానం ప్రకారం కృష్ణానది యాజమాన్యం బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే ఎడమ కాలువ పరిధిలో 2వ, 3వ జోన్‌లలో ఉన్న కాలువల నిర్వహణకు ఎస్టిమేట్లు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ ఎడమ కాలువ పరిధిలో వేసవిలో తాగునీటి అవసరాల కోసం ప్రతిపాదించిన 3.75 టీఎంసీల నీటిని తెలంగాణ ఎన్నెస్పీ అధికారులతో విడుదల చేయించాలన్నారు. అలాగే వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ మాట్లాడుతూ 3వ జోన్ పరిధిలో ఎడమ కాలువల ఆధునికీకరణకు 16వ ఆర్థిక సంఘం నుంచి ప్రతిపాదించిన రూ.199 కోట్ల నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, నూజివీడు డివిజన్ ఈఈ ఆర్ సంతోష్, జగ్గయ్యపేట డివిజన్ ఈఈ కే.కిషోర్ డీఈలు కే సీతారావమ్మ, వీఎస్ ఆర్ ప్రభు, కే రామదాసు, శశికుమారి, రాంబాబు, విజయలక్ష్మి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో జైలు

తాడేపల్లిగూడెం అర్బన్: అదనపు కట్నం వేధింపుల కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా కోర్టు విధించింది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడెంకు చెందిన పడాల చిరంజీవి రెడ్డికి వివాహం కాగా ఆ విషయం దాచిపెట్టి అనుపమ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. అంతే కాకుండా ఆమెను అదనపు కట్నం కోసం వేధిస్తుండగా బాధితురాలు అనుపమ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరం రుజువు కావడంతో చిరంజీవి రెడ్డికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్‌కు ఏపీపీ అడబాల రవిప్రసాద్ సహకరించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మద్యం మత్తులో బలవన్మరణం

జంగారెడ్డిగూడెం: మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన దెయ్యం పోశయ్య (45) వంట మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబసభ్యులకు దూరంగా భద్రాచలంలో ఉంటున్నాడు. సోమవారం పట్టణంలోని తన సోదరుడు వెంకటేశ్వరరావు ఇంటికి పోశయ్య వచ్చాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వానికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పోశయ్య మృతిచెందాడు.

బైక్ మీద నుంచి జారిపడి మహిళ మృతి

భీమవరం: బైక్‌పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఏఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలివి. దిరుసుమర్రు సంతోషపురానికి చెందిన జి.మేరీ మాత (40) బంధువుతో కలిసి మోటార్‌సైకిల్‌పై భీమవరం నుంచి ఇంటికి వెళుతండగా యనమదుర్రు రోడ్డులోకి వచ్చేసరికి బైక్ వెనుక కూర్చొన్న ఆమె జారిపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి రూతమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

పెంటపాడు: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆకుతీగపాడులో చోటుచేసుకుంది. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన దాసం ఉమేష్ (28) తాడేపల్లిగూడెంలోని ఒక షాపులో పనిచేస్తున్నాడు. ఇతని భార్య గర్భిణి. ఉమేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి చెప్పారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోలమూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆలమూరి జోషిరాజు(33) తన భార్యతో మనస్పర్థల కారణంగా ఆరేళ్ల నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుని పడుకున్నాడు. మంగళవారం ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో అతని సోదరుడు విమల్ ప్రభాకర్ తలుపులు పగులగొట్టి చూడగా జోషిరాజు ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడి ఉన్నాడు. కాగా ఇటీవల ఓ వ్యక్తి ఇంట్లో జోషిరాజు చోరీకి పాల్పడి సెల్‌ఫోన్, రూ.1,500 దొంగిలించడంతో పైద్ద మనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకున్నారు. జోషిరాజు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంధకంతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో ఏపుగా ఎదిగిన అరటి తోట



ఎండీ షాఫియ ఫర్‌హీన్, ఉద్యానాధికారి

చింతలపూడి: ఉద్యాన పంటల్లో మొక్కల పెరుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషక పదార్థాల్లో గంధకం ఒకటి. ఉద్యాన పంటల్లో గంధకం వాడకం వల్ల 25 శాతం దిగుబడి పెరుగుతుందని ఉద్యానాధికారి ఎండీ షాఫియ ఫర్‌హీన్ తెలిపారు. మెట్ట ప్రాంతంలో రైతులు ఉద్యాన పంటలను ఎక్కువగా పండిస్తుంటారని, ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల్లో వాడే పోషకాలను గురించి ఆమె వివరించారు. సాధారణంగా మెట్టప్రాంత రైతులు స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, మెగ్నీషియం, బోరాన్‌లను వాడుతుంటారన్నారు. వీటితో పాటు అదనంగా గంధకం వాడితే ఆయిల్ పాం, కొబ్బరి, నిమ్మ, బత్తాయి, అరటి, మామిడి తోటల్లో దిగుబడి గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

గంధకం ఉపయోగాలు

గంధకం క్లోరోఫిల్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇది మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆహారాన్ని తయారు చేయడానికి అవసరం. కొన్ని విటమిన్ల ఉత్పత్తికి గంధకం చాలా అవసరం. పండ్ల రుచి, వాసన, రంగును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఉదాహరణకు, ఉల్లిపాయ, వెల్లుల్లిలో వాటి ప్రత్యేకమైన వాసన గంధకం వల్లనే వస్తుంది. కొన్ని సందర్భాల్లో, గంధకం శిలీంద్ర నాశినిగా, కొన్ని రకాల తెగుళ్లను నివారించడానికి కూడా ఉపయోగించబడుతుంది.

వేటిలో లభిస్తుందంటే..

గంధకం మనకు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, అమ్మోనియ సల్ఫేట్, జిప్సం, సల్ఫేట్ ఆఫ్ పొటాష్, జింక్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్, మాంగనీస్ సల్ఫేట్, ఐరన్ సల్ఫేట్‌ల రూపంలో మార్కెట్లో దొరుకుతుంది. గంధకం నేలలో వాడినప్పుడు దాని ఆమ్ల స్వభావం నేల ఉదజని సూచిక 6 నుంచి 6.5 వరకు వచ్చే సరికి నేలలోని అన్నిరకాల పోషకాలు మొక్కకు అందుబాటులోకి వస్తాయి. చౌడు భూములను బాగు చేసుకోవడానికి నేలలోని ఉదజని సూచికను బట్టి ఎకరానికి 500 కేజీల జిప్సంను వాడినట్లయితే దిగుబడి బాగా పెరుగుతుంది. గంధకం వాడకంతో పంట నాణ్యత, పరిమాణము, గింజల్లో నూనె శాతం పెరుగుతుంది.

ఆదాయం పెరుగుతుంది

ఉద్యాన పంటల్లో తక్కువ ధరలో అందుబాటులో ఉండే జిప్సం, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 50 శాతం, సల్ఫర్ గుళికలు 90 శాతం వాడినట్లయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. కాపుకాసే తోటలైతే 500 గ్రాములు, వయస్సును బట్టి 5 నుంచి 10 కేజీల జిప్సం సంవత్సరానికి రెండు సార్లు వేసుకున్నట్లయితే దిగుబడులు పెరుగుతాయి. ఇతర పండ్ల తోటలకు, కూరగాయల తోటలకు అయితే దుక్కిలో ఎకరానికి నేల స్వభావాన్ని బట్టి 300 నుంచి 500 కేజీల జిప్సంను వాడుకోవచ్చు.

మౌలిక సదుపాయాలు కరువు

- రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు
- రానున్నది వర్షాకాలం
- ఇప్పట్నించే చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి


తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెంలో ఇళ్ల సముదాయానికి వెళ్లే రహదారి


ఆరుగొలను గ్రామంలో ఇంటిలోని వాడకం నీటిని గుంతలను ఏర్పాటు చేసుకుని మళ్లిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ఇంటి సముదాయాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు లేక దోమలతో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే 25 లే అవుట్లను ఏర్పాటు చేసి, 3130 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 2120 ఇళ్లు పూర్తి చేశారు. అప్పటికే విద్యుత్, మంచినీటి సౌకర్యాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ లోపుగా ఎన్నికలు రావడంతో రోడ్లు, డ్రెయినేజీ వంటి పనులు నిలిచిపోయాయి. దీంతో కాలనీ వాసులు ఇళ్లల్లోని మురుగునీటిని పైపు లైన్ల ద్వారా ఖాళీ ప్రదేశాల్లోకి మళ్లించారు. ఓపెన్ డ్రెయిన్లు కావడంతో దోమలు విజృంభించి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఇళ్ల సముదాయాల్లో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రెయినేజీ పనులను చేపట్టాల్సి ఉంది. రానున్నది వర్షాకాలం కావడంతో ఈ రెండు నెలల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే కాలనీ వాసులు వర్షపు, నీరు, మురుగునీటిలోనే రాకపోకలు సాగించక తప్పదు.

రోడ్లపైనే మురుగు నీరు



కాలనీల్లో కనీసం కచ్చాడ్రెయిన్లు లేకపోవడంతో ఇంటిలో వాడకం నీటిని బయటకు వదిలేసే పరిస్థితి. దీంతో రోడ్లపైనే మురుగునీరు తిష్ట వేస్తోంది. ఈ నేపథ్యంలో దోమలు పెరిగి రాత్రి సమయాల్లో రక్తాన్ని పీల్చేస్తున్నాయి. అలాగే, గోదావరి నీటిని కాలనీవాసులకు అందించాలి.

– శనగన నర్సమ్మ, ఆరుగొలను, తాడేపల్లిగూడెం మండలం

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల సముదాయాల్లో రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం రోడ్లు కూడా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. రానున్నది వర్షాకాలం కావడంతో రోడ్లు, డ్రెయినేజీ వంటి సౌకర్యాలు కల్పించాలి.

– కండెల్లి సోమరాజు, సీపీఎం నాయకుడు, తాడేపల్లిగూడెం మండలం

జాబ్‌మేళాలో 80 మందికి ఉద్యోగాలు


తణుకులో జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌ఆర్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్‌ఎస్‌డీసీ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఎన్‌సీఎస్ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌సి స్థాయిలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించాయని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు తెలిపారు. మొత్తం 220 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 80 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డీఎస్‌డీఓ డాక్టర్ పి.లోకమాన్, ఎంప్లాయిమెంట్ ఎం.కిషోర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ కే. నాగభూషణ్ రెడ్డి, జేకేసి కోఆర్డినేటర్ డాక్టర్ టి. సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండోరోజు కొనసాగిన ఆర్టీసీ కార్మికుల దీక్షలు


తణుకులో నిరాహారదీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

తణుకు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిపో ప్రాంతంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షలకు మంగళవారం తణుకు డిపో బహుజన వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శాంసన్, ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ సభ్యులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు మునగాల రత్నం, తణుకు డిపో అధ్యక్షుడు సరిదే ఏసుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హౌసింగ్‌బోర్డు ఎంట్రన్స్ వద్ద వేంచేసియున్న శ్రీ దక్షిణ ముఖ సువర్చలాసహిత ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సహాయ సహకారాలతో మజ్జిగ, చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఆకుల నరసింహ మూర్తి, సభ్యులు, ఎ.శ్రీనివాస్, ఆదిత్యకుమార్, శేషయ్య, దేవేందర్, కుమారస్వామి, ముత్యాల శ్రీనివాస్, ప్రసాద్‌లు పర్యవేక్షించారు. జూన్ నెల వర్షాలు పడే వరకు చలివేంద్రం కొనసాగుతుందని, చలివేంద్రంను ప్రజలు, పాదచారులు ఉపయోగించుకోవాలని కోరారు.

కవి ప్రసాద్‌కు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం


వీఎస్‌వీ ప్రసాద్, కవి, తణుకు

తణుకు అర్బన్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వీఎస్‌వీ ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ తనకు ఆహ్వాన లేఖను పంపించినట్లు కవి ప్రసాద్ మంగళవారం తెలిపారు.

దేశంలో ప్రజలంతా క్షేమంగా ఉండాలని ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశంలో ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుతూ తాడేపల్లిగూడెం క్రీస్తు సంఘం చర్చి ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ రొక్కాల నాగ బుజ్జిచే మంగళవారం మత ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీరలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. మృతి చెందిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రజలందరు ఐక్యంగా నడవాలని కోరారు. క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు


ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఇంటర్వ్యూలు జరిగాయి. తాడేపల్లిగూడెం, తణుకు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఆర్డీఓ కొసర భాను, పీడీ ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ సుజాత రాణి, జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో ప్రత్యేక హోమాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన నీలాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రాత్రికి మహాశాంతి కుంభ అభిషేకం, కుంభార్చన, శయనాధివాసం, సర్వదేవతార్చనం, ప్రధాన హోమం, వేదస్వస్తి, తీర్థప్రసాద వినియోగం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి


తణుకు సబ్‌జైల్‌లో ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.రత్నప్రసాద్

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉమ్మడి గోదావరి జిల్లాల సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ మంగళవారం తణుకు సబ్‌జైల్‌ను సందర్శించారు. రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహారం, వసతి, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని వారి ఆర్థిక స్తోమతను పరిశీలించి ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే శిక్ష పడిన ముద్దాయిలు కూడా వారి కేసులు అప్పీల్ చేసుకొనుటకు ఆర్థిక స్తోమత లేనిపక్షంలో వారికి కూడా ఉచిత న్యాయ వాదిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జైలులో ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడితే వెంటనే వారికి వైద్య సదుపాయాలు అందజేయాలని జైల్ సూపరింటెండెంట్ మోహన్‌రావును ఆదేశించారు. అనంతరం మెంటల్ హెల్త్ యాక్ట్ ప్రకారం మానసిక ఆస్పత్రులైన ప్రియాంక నర్సింగ్‌హోమ్, ఎస్‌వీబీ నర్సింగ్‌హోమ్‌లను సందర్శించి వైద్యులు డాక్టర్ కుడారి ఆనంద్, డాక్టర్ ఆర్.సూర్యారావులతో న్యాయమూర్తి పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జైల్ ప్యానెల్ న్యాయవాదులు జగిలంక శివ, పీఎల్‌వీ కారుమంచి నాని, సీనియర్ న్యాయవాది కొరు వెంకటేశ్వర్లు, కొల్లి ఆనంద్ కుమార్, లిజన్ ఆఫీసర్ కృష్ణమూర్తి, పీఎల్‌వీలు గిరి, ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఎన్నికల్లో విజయంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలస్వామి

తణుకు అర్బన్: దేశంలోనే అత్యంత పేరుగాంచిన ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యు) జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ మూడు పోస్టులను గెలుచుకుందని ఇందులో ప్రధానంగా యూనివర్సిటీ అధ్యక్ష పదవితోపాటు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) అభ్యర్థి కామ్రేడ్ నితీష్ కుమార్ గెలుపొందారని వీరికి జిల్లా కమిటీ తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామని ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం తణుకులో స్థానిక ఎస్‌ఎస్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా వామపక్ష విద్యార్థి సంఘమైన. ఏఐఎస్‌ఏ అధ్యక్ష పదవిని కైవసం చేసుకుంటూ వస్తుందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ ప్రతిష్ఠను, ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేయాలని చూసే మత ఉన్మాద శక్తుల ఆగడాలకు ఉన్నత విద్యను అభ్యసించే వేలాదిమంది విద్యార్థులు ఈ విజయం ద్వారా ఒక హెచ్చరిక జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. శివ, ఎస్. క్రాంతి, తానేటి బెన్ని, ఎస్ ప్రణీత, ఎస్. వసుందర, జి గంగాభవాని పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం


మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంపుపై ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అధ్యక్షతన కిశోర వికాసం కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం జీవీకే డీఎం.లక్ష్మి మాట్లాడుతూ యుక్త వయస్సు బాలికలకు ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించాలన్నారు. మహిళా పోలీసులు కిశోరవికాసం కమిటీ కన్వీనర్లు కావడంతో బాధ్యతాయుతంగా సమ్మర్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10వతేది వరకు ప్రతీ మంగళ, శుక్రవారాలు కిశోర వికాసంపై సమావేశాలు నిర్వహించాలని కమిటి సభ్యులకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు బేబి, శ్రీదేవి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కిషోర్ వికాస్ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మునిసిపల్ మెప్మా హాల్‌లో కిషోర్ వికాసం- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం ఎం.ఎస్‌కేలు, ఆర్పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలకు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు కిషోర్ పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు ఎం.సీతారాం ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారాంప్రసాద్ తెలిపారు. స్థానిక కపర్ది భవనంలో పార్టీ కడకట్ల శాఖ మహాసభ కార్యదర్శి వి.మేరీ అధ్యక్షతన జరిగింది. సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న పాలకులు ధరలు పెంచుతూ పేదలకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ పోరాటాలతో ముందు వరసలో ఉందని, ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా విస్తృతతం ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ ధరలు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడం లేదని, పేద ప్రజలు, మధ్య తరగతి వారు ఇబ్బందులు పడుతున్నారని, తదితర సమస్యలపై చర్చించారు.

విద్యార్థులను సత్కరించిన 'మానవత'


విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ, దాత చిట్టూరి సుజాత

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థాయి మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఘనంగా సత్కరించారు. తణుకు గమిని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అలాగే నేడు మెరిట్ విద్యార్థులను సత్కరించడం మంచి పరిణామమన్నారు. అనంతరం పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత సౌజన్యంతో 80 మంది విద్యార్థులను సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, మానవత విస్తరణ మరియు అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి బోయపాటి రామలక్ష్మి, జిల్లా కన్వీనర్ ఎస్ వి సతీష్ బాబు, చైర్మన్ వీవీ రామకృష్ణ, కోచైర్మన్ ఆనందం మస్తాన్‌రావు, కన్వీనర్ అక్క పంతుల బాలాజీ, సెక్రటరీ బోయపాటి రామకాశి, ట్రెజరర్ అక్కిన కాశీ విశ్వనాథం, విద్యార్థులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, డైరెక్టర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు


వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను విద్యార్థినీ, విద్యార్థులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని పలువురు రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం రెండో రోజు వేసవి శిక్షణ శిబిరం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు 35 మంది శిక్షణలో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. వేసవి శిక్షణ శిబిరం ఎలా జరుగుతుందో పరిశీలించారు. శిబిరాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొనే విధంగా తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన జి.బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్దనరావు, ఆర్.నాగేంద్ర కుమార్, కోపల్లె శ్రీనివాస్‌లచే విద్యార్థులకు కథలు, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, యోగా, క్రీడలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన


అత్తిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణశిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలపై రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు అవగాహన కల్పించారు. బుక్ రీడింగ్ ద్వారా బాషా నైపుణ్యం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. రాజారవివర్మ జయంతి సందర్భంగా అమర్ ఆర్ట్స్ అకాడమి తరపున విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెళకువలను వివరించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రీడర్స్‌ఫోరం సభ్యులు దొరబాబు, వి పార్వతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు పెంటపాడు విద్యార్థి


వర్షిణిని అభినందిస్తున్న ఉపాధ్యాయురాలు సాయి స్వరూప

పెంటపాడు: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీలలో పెంటపాడు 10వ తరగతి విద్యార్థిని వర్షిణి ఎంపిక య్యారు. ఈనెల 21 నుంచి 23 వరకు ఏలూరులో 26 జిల్లాల నుండి 150 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విభిన్నప్రతిభావంతులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక ప్రతిభను కనపరిచారు. వారిలో పదోతరగతి చదువుతున్న వర్షిణి ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్కూలు హెచ్‌ఎం ఎస్.రాజేష్, ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌లు ప్రత్యేకంగా అభినందించారు. వర్షిణి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలలో త్వరలో పాల్గొంటుందని స్వరూప తెలిపారు.

భూ సర్వే కోసం ఆస్తుల వివరాలు ఇవ్వండి

తాడేపల్లిగూడెం: కేంద్రం, ఏపీ ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డులు ఆధునీకరణలో భాగంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని అన్ని రకాల భూములు సర్వేలు అనగా నివాస స్థలములు, ఖాళీ ప్రదేశాలు, వ్యవసాయ భూములు సర్వే చేస్తున్నట్లు మునిసిపల్ కమీషనర్ ఏసుబాబు తెలిపారు. పట్టణ పరిధిలోని కడకట్ల, యాగర్లపల్లి, జువ్వలపాలెం ఏరియాలకు సంబంధించి ఉన్నటు వంటి ప్రజలకు సంబంధించిన ఆస్తుల వివరాలను సచివాలయంలోని సెక్రటరీలకు అందజేసి, సర్వేకు సహకరించాలని కోరారు. దస్తావేజులు, ఆధార్, ఫొటోలు, సంబంధిత పత్రాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

దోమలతోనే ఫైలేరియా వ్యాప్తి


వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో ఫైలేరియా కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల ద్వారానే ఫైలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.హర్ష తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఫైలేరియా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష మాట్లాడారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ ఫిలేరియాసిస్ అనే దోమల ద్వారా వ్యాపించే పరాన్న జీవి శోషన వ్యవస్థ, చర్మంపై ఉండే కణజాలంపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణరావు, ఆరోగ్య కార్యదర్శులు సుసన్న, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆర్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

వీరవాసరం: పెరికిపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితుడు అలవల వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని చంద్రశేఖర్, స్థానిక నాయకుల ఆర్థిక సాయంతో మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు.

ఆస్తిని కాజేసి.. దౌర్జన్యానికి దిగారు


వీరంపాలెంలో మీడియాతో మాట్లాడుతున్న శ్యామల నాగమణి

తాడేపల్లిగూడెం రూరల్: తన ఆస్తిని కాజేసి దౌర్జన్యానికి పాల్పడ్డారని వీరంపాలెం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ శ్యామల నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వీరంపాలెం గ్రామంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని 1.74 ఎకరాల భూమి తన తండ్రి ద్వారా సంక్రమించిందన్నారు. అయితే ఈ భూమిని గ్రామానికి చెందిన ముప్పిడి వెంకటరెడ్డికి కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూమిని కాజేసి తన తండ్రి సత్తిరెడ్డికి చెందిన ఆస్తిగా వెంకటరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తనకు న్యాయం జరగలేదన్నారు. దీనిపై కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా ధిక్కరించి తనపై దౌర్జన్యానికి పాల్పడినట్లు వాపోయారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు నడుస్తుందని తెలిపారు. తనకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆశ్రయించగా, తనకు భరోసానిచ్చారన్నారు. తనకు ప్రాణహాని ఉందని, తన భూమి తనకు ఇప్పించాలని వేడుకున్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పాస్టర్లు



యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న దృశ్యం

అత్తిలి: కశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అత్తిలి మండలం పాస్టర్స్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో దైవజనులు టెర్రరిస్టుల దాడిని ఖండిస్తూ అక్కడ మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. టెర్రరిజం నశించాలని, టెర్రరిజం మీద జరుగుతున్న యుద్ధంలో భారతదేశానికి విజయాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తూ సంఘీభావం వ్యక్తం చేశారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పహల్గాం ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన జరిగింది. మండల యూనిట్ నాయకులు అధ్యక్షుడు పి.తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీదేవి, జిల్లా కార్యదర్శి ఎస్.రత్నరాజు, సీనియర్ నాయకులు ముత్యాల రామకృష్ణ, ప్రత్తి వీరాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.